క్లుప్తంగా

రక్తదానం మహాదానం



చాట్రాయి: అన్ని దానాల్లోకంటే రక్తదానం మహాదానమని తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. మండలంలోని చనుబండ గ్రామంలో యువభారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించినపుడు రక్తం చాలా అవసరమవుతుందని అలాంటప్పుడు ట్రస్టులు, ఫౌండేషన్ల ద్వారా సేకరించిన రక్తం బాధితుల ప్రాణాలను కాపాడుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు జల్లేపల్లి పరమేశ్వరావు, ఫౌండేషన్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, అఖిల్, చిట్టిబాబు, నరేంద్ర పాల్గొన్నారు.

ఎడీఎస్‌యూ నగర కమిటీ ఎన్నిక

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సమాజంలో పెరుగుతున్న అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) నాయకుడు వి.శ్రీనివాసరావు చెప్పారు. సున్నపుబట్టీల సెంటర్‌లోని రామనర్సయ్య భవన్‌లో పీడీఎస్‌యూ 12వ నగర మహాసభ ఆదివారం జరిగింది. శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవరచుకోవాలని చెప్పారు. సీపీఐ ఎం.ఎల్ న్యూడెమొక్రసీ నగర కార్యదర్శి పోలారి పాల్గొన్నారు.

రేపు గడప గడపకు మన ప్రభుత్వం

విస్సన్నపేట: మండలంలోని కలగర సచివాలయం పరిధిలో ములగలపాటివారిగూడెం, లక్ష్మీపురం గ్రామాల్లో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయవర్గం ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొని గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అమలు గురించి వివరిస్తారని పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసి నాలుగేళ్లు అయిన సందర్భంగా కలగరలో విజయోత్సవం, పలు సేవాకార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

మజ్జిగ పంపిణీ



ఊటుకూరు(గంపలగూడెం): సేవా కార్యక్రమాల్లో భాగంగా ఊటుకూరు వాసవీ, వనిత, కన్యక క్లబ్‌ల ఆధ్వర్యంలో బస్టాప్ సెంటర్లో నిర్వహిస్తున్న చలివేంద్రంలో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఎండల తీవ్ర కారణంగా బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని 60 రోజులుగా దాతల సహకారంతో నిర్వహిస్తున్నారు. వాసవీ క్లబ్ ప్రతినిధులు వేముల ప్రకాష్‌బాబ్జి, వేముల ఫణికుమార్ పాల్గొన్నారు.

సీఎస్ఐ డీనరీ చైర్మన్‌కు వీడ్కోలు



తిరువూరు: చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా తిరువూరు డీనరీ చైర్మన్ రెవరెండ్ జీ పరిశుద్ధరావు ఏలూరు జిల్లా చింతలపూడి డీనరీకి బదిలీ అయ్యారు. సీఎస్ఐ చర్చిలు, పాఠశాలల అభివృద్ధికి పరిశుద్ధరావు చేసిన కృషిని తిరువూరు నియోజకవర్గ క్రిస్టియన్ కౌన్సిల్ చైర్మన్ గంటా జయంత్‌బాబు వివరించారు. సంఘ పెద్దలు సత్యం, కిశోర్, వీరాస్వామి, నిరంజన్, భాస్కరరావు పరిశుద్ధరావును సత్కరించారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

ఆగిరిపల్లి: ఆగిరిపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నైనవరపు సీతారామస్వామి(78) గత కొన్ని రోజులుగా శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. 40 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి, 2003లో ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

సావర్కర్‌కు ఘన నివాళి

గంపలగూడెం: బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్యసమరయోధులు సావర్కర్ జయంతిని ఆదివారం నిర్వహించారు. స్థానిక వర్తకసంఘంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు టీ మోహన్‌రావు సావర్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి డీ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బీజేపీ మండల మహిళామోర్చా అధ్యక్షురాలుగా వనమా సత్యవాణి, బీసీ మోర్చా అధ్యక్షుడిగా పీ శివశంకర్, పట్టణ మోర్చా పార్టీ అధ్యక్షురాలుగా వనమా పద్మను నియమించారు.

వైఎస్సార్ సీపీ పటిష్టానికి సైనికుల్లా పనిచేయాలి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ఎమ్మెల్యే మేకా ప్రతాప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

నూజివీడు: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని మరింత పటిష్టం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండలంలోని కనసానపల్లిలోని 11 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ నాయకుడు మచ్చా హరిబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ప్రతాప్ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్రాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో మార్పు వచ్చిందన్నారు. ఇంటి స్థలాలు లేని పేదలందరికీ నివేశన స్థలాలను అందజేసి, ఇళ్లు మంజూరు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ పేదలకు ఏమాత్రమైన ఉపయోగముందా అని ప్రశ్నించారు. పేదల కోసం ఒక్క పథకమైనా అమలు చేయలేదన్నారు. అలాంటి వ్యక్తిని నమ్మితే ప్రస్తుతం అమలవుతోన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ రద్దు చేస్తారన్నారు. వైఎస్సార్ సీపీలో చేరినవారిలో అయినంపూడి శివరామకృష్ణ, చోటిశెట్టి గోవింద్, చోడిశెట్టి సురేష్, చోడిశెట్టి రమేష్, చోడిశెట్టి రవి, బజారు రామకృష్ణ, బజారు చరణ్, పులుపు మణికంఠ, ముత్తంశెట్టి రాము, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, సర్పంచి అమ్మిశెట్టి సంజీవరావు, ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు బజారు రాంబాబు పాల్గొన్నారు.

అంకమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే



ఈదరలో పంగిడమ్మ అమ్మవారి ఆలయంలో మొక్కుబడుల కార్యక్రమంలో ఎమ్మెల్యే

ఆగిరిపల్లి: మండలంలోని ఈదరలో వేంచేసియున్న పంగిడమ్మ అమ్మవారిని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం దర్శించుకున్నారు. మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మచ్చా హరిబాబు మొక్కుబడులు కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, ఆయన తనయుడు వేణుగోపాల అప్పారావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహరావు, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, రాష్ట్ర కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతీ మురళీ పాల్గొన్నారు.

ఎండలు భగ భగ

నిర్మానుష్యంగా రోడ్లు



మైలవరంలో నిర్మానుష్యంగా మారిన భద్రాచలం రోడ్డు

మైలవరం: మైలవరంలో ఎండలు భగ భగ మండి పోతున్నాయి. రోహిణీ కార్తె ప్రవేశించడంతో ఒక వైపు ఎండలు మండుతుంటే, మరో పక్క వడగాల్పుల తీవ్రత పెరుగుతోంది. దీంతో ఎండ వేడి ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 6.30 గంటల నుంచే సూర్యుడు తన ప్రభావం చూపిస్తూ దర్శనమిస్తుంటే ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. మధ్యాహ్నం సమయానికి ఎండ తీవ్రత పెరగడంతో భద్రాచలం, విజయవాడ రోడ్లు, అంతర్గత రహదారులు నిర్మానుష్యంగా మారాయి. మైలవరంలో ఆదివారం ఎండ తీవ్రత 42.8 డిగ్రీలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. నియోజకవర్గంలోని రెడ్డిగూడెంలో 42.4 డిగ్రీలు, ఇబ్రహీంపట్నంలో 43.9 డిగ్రీలు, జి.కొండూరులో 42.4 డిగ్రీలు ఉంది. వచ్చే రెండు, మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎండలో తిరగవద్దని, ఉదయాన్నే పనులు ముగించుకుని ఇళ్లలోనే ఉండాలని చంద్రాల పీహెచ్‌సీ వైద్యులు నరేష్ తెలిపారు. ఎండ తీవ్రతకు శరీరంలోని నీరు ఆవిరై పోతుందని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు దగ్గర ఉంచుకోవాలని, మజ్జిగ, తాగునీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు.

యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ మరమ్మతులు



పైప్‌లైన్ మరమ్మతులు అర్ధరాత్రి చేస్తున్న అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: స్థానిక పంప్ హౌస్ నుంచి మెయిన్ స్టోరేజ్ ట్యాంక్‌కు వెళ్లే ప్రధాన పైప్‌లైన్ శనివారం మరమ్మతులకు గురైంది. ఈ పరిణామాలతో కొండపల్లి, ఇబ్రహీంపట్నంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తక్షణమే స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు యుద్ధప్రాతిపదికన నాలుగు అడుగుల లోతులో ఉన్న పైపులను జేసీబీతో తవ్వి వాటి స్థానంలో నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి వరకు జరిగిన పైప్‌లైన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పర్యవేక్షించారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన వికాసం



రెడ్డిగూడెం శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



తిరువూరు గ్రంథాలయంలో దేశభక్తి గీతాల పోటీలు



గోపవరం గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

నూజివీడు: పుస్తక పఠనంతో విద్యార్థుల్లో విజ్ఞాన వికాసం సాధ్యమవుతుందని గొల్లపల్లి గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో ఉన్న శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కథల పుస్తకాలు, మహనీయులకు చెందిన జీవిత చరిత్ర పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పుస్తకపఠనం అలవర్చుకోవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. తద్వారా పోటీ పరీక్షల్లో సులువుగా రాణించవచ్చన్నారు. నీతి కథలు చదవడం వల్ల జీవితంలో ఇరుగు పొరుగు వారితో, పెద్దలతో ఎలా మెలగాలి, ఎలా జీవించాలనే అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. గ్రంథాలయాలను సమాజంలోని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

రెడ్డిగూడెం: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని స్థానిక శాఖ గ్రంథాలయ సిబ్బంది పేర్కొన్నారు. ఈ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వి. రాంబాబు ఆధ్వర్యంలో పిల్లలకు నీతి కథలు చెప్పడంతో పాటు పుస్తకాలు చదివించా. జీకే బిట్స్ చెప్పడం, ఆటలు, తాడు ఆట, క్యారంబోర్డు తదితర ఆటలు ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది టి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు

తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు దేశభక్తి గీతాల ఆలాపన పోటీలు నిర్వహించారు. తెలుగు భాషలో దేశభక్తి గీతాల విశిష్టతను తెలుగు భాషా వికాస సమితి కన్వీనర్ తోట ఉమామహేశ్వరరావు వివరించారు. విజేతలకు బహుమతులందజేశారు. స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణను ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ రాం ప్రదీప్ నిర్వహించారు. గ్రంథాలయాధికారి పద్మావతి పర్యవేక్షించారు.

పెనుగొలనులో..

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు అల్లావుద్దీన్ అద్భుతదీపం, బామ్మచెప్పిన బంగారు నీతి కథలు పఠించారు. అనంతరం షిర్డీసాయిబాబా సేవసమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ నిర్వహణాధికారి జ్యోతిర్మయి పాల్గొన్నారు.

చిన్నారులకు నీతి కథల బోధన

ముసునూరు: ఉత్తమ ఆలోచనలు, నడవడికి నీతి కథలు మార్గం చూపుతాయని పలువురు ఉపాధ్యాయులు సూచించారు. గోపవరం గ్రంథాలయంలో బ్రాంచి అధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం నీతి కథల ప్రాధాన్యాన్ని చిన్నారులకు వివరించి, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వైపిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమాల్లో మండల పరిధిలోని వివిధశాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎ.కొండూరులో..

ఎ.కొండూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ప్రజా సమస్యలపై అర్జీలు పెట్టుకుంటే, వాటిని పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

ఆగిరిపల్లి: మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన తోట భాను ఇండో–నేపాల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పతకం సాధించి గ్రామానికి వచ్చిన సందర్భంగా పలువురు విద్యార్థినిని అభినందించారు. పిన్నమరెడ్డిపల్లి సర్పంచ్ జాలా భూషణం, సీఎస్ఐ పారిస్ గురువు రత్నకిషోర్, సీఎస్ఐ సంఘ కాపరి వరకుమార్ అభినందించారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీలో శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజైన ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఆలయ అర్చకులు అంగలూరి రంగాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే ఆలయంలో శ్రీదేవీ, భూదేవీ శిలాబింబాలను వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ప్రతిష్ఠించారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి పర్యవేక్షించారు.

కాపు సేవాసంఘం సేవలు అద్వితీయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): కాపు సేవాసంఘం సేవలు అద్వితీయమని ఆచంట బాలాజీ నాయుడు అన్నారు. స్థానిక దేవీనగర్ ఆచంట వెంకటరత్నంనాయుడు సర్కిల్‌లో ఆదివారం రంగస్థల రారాజు, హంస, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దివంగత ఆచంట వెంకటరత్నం నాయుడు జయంతి సందర్భంగా ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాపు సేవాసంఘం నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు



గోసవీడులో పునర్నిర్మాణం చేసిన విశ్వేశ్వరస్వామి ఆలయం

గోసవీడు(గంపలగూడెం): గంపలగూడెం మండలం గోసవీడులో పలు ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలను సోమవారం నుంచి ప్రారంభిస్తారు. గ్రామంలోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో పునర్‌ప్రతిష్ట, భక్త ఆంజేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట, గ్రామ దేవతలు ముత్యాలమ్మ, అక్కలమ్మ ఆలయంల్లో విగ్రహ ప్రతిష్ట, యంత్ర ప్రతిష్ట కార్యక్రమాలను ఈ నెల 31వ తేదీన ఉదయం 8.13 గంటలకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు. సోమవారం గణపతి పూజతో ప్రత్యేక పూజాకార్యక్రమాలను అర్చకులు అరిపిరాల అప్పయ్యశాస్త్రి, అర్చకబృందంచే ప్రారంభిస్తారని తెలిపారు. మంగళవారం కలశపూజ, రుద్రసహిత హోమం, ధ్వజస్తంభ ఊరేగింపు, బలిహరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం 11గంటల నుంచి భక్తులకు మహాఅన్నదానం చేస్తారు.

సద్గురు ఆజ్ఞ శిరోధార్యం

ఏ.కొండూరు: సద్గురువు మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి ఆజ్ఞయే శిరోధార్యంగా పనిచేస్తున్నామని ఏఏబీఎస్‌టీఏ నిర్వాహకులు ఆత మొహమ్మద్ నిజాముద్దీన్ నిజామి షా తాజ్ ఖాదరి పేర్కొన్నారు. మండలంలోని చీమలపాడులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ గ్రామంలో వేంచేసియున్న మహనీయుల మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి దీవెనలతో జంపని గ్రామంలోని ఏఏబీఎస్‌టీఏ దర్బార్‌లో గత కొన్ని సంవత్సరాలుగా మహా దివ్య అన్న సమారాధనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ గ్రామంలో బాబా వారి మహా దివ్య సమాధిని ప్రతిసారి దర్శించుకుంటూ చాదర్, పూలు, గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు జరుపుతుంటారన్నారు. బాబా వారి ఆజ్ఞ ప్రకారం వారు సూచించిన మార్గంలో నడుచుకుంటూ మహనీయులను స్మరించుకుంటూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జంపని గ్రామంలోని దర్బార్లో కుల మతాలకు అతీతంగా అన్నదానం నిర్వహిస్తూ మహనీయుల జెండా గంధ మహోత్సవాలు నిర్వహిస్తుంటామని పేర్కొన్నారు.

చంద్రబాబు వైఖరికి నిరసనగా నేడు ర్యాలీ

నూజివీడు: పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇళ్ల స్థలాలు ఇస్తే వాటిని శ్మశానాలతో పోల్చిన చంద్రబాబు వైఖరికి నిరసనగా సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. ఈ ర్యాలీలో పట్టణంతో పాటు నాలుగు మండలాల్లోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. ర్యాలీ అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

రేపు కార్యకర్తలతో విస్తృత సమావేశం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నాలుగేళ్లలో ప్రభుత్వం సాధించిన విజయాలను అందరికీ చాటిచెప్పేందుకు ఈ నెల 30న సాయంత్రం నాలుగు గంటలకు నూజివీడు పట్టణంలోని వీ కన్వెన్షన్ సెంటర్‌లో విస్తృత కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్ సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదంలో అన్ని అనారోగ్య సమస్యలకు మంచి చికిత్స ఉందన్నారు. ఆయుర్వేద వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ద్రవపదార్థాలను అధికంగా తీసుకోవాలని సూచించారు. ప్రముఖ హోమియోపతి వైద్యుడు డాక్టర్ కోన వీరబ్రహ్మం మాట్లాడుతూ.. ఇప్పుడు ఎక్కువ చల్దీ వస్తుందని చల్దికి హోమియోపతిలో మంచి చికిత్స ఉందన్నారు. చల్ది వైరస్ వల్ల వస్తుందని చెమటలు పట్టిన చోట సక్రమంగా శుభ్రం చేసుకోకపోవటం వల్ల సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎండల్లో బయట తిరగరాదని, ద్రవపదార్థాలు అధికంగా కలిగిన కూరగాయలు, సీజనల్ పండ్లు తీసుకోవాలని సూచించారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 200 మంది వైద్యసేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ పాల్గొన్నారు.

శుభ్రత పాటించాలి

నూజివీడు: కౌమారదశలో ఉన్న బాలికలతో పాటు మహిళలందరూ రుతుస్రావం సమయంలో పరిశుభ్రతను కలిగి ఉండాలని ఏరియా ఆస్పత్రి గైనకాలజిస్టు సుష్మ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌమ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం మెప్మా ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రుతుస్రావ సమయంలో మెత్తటి దుస్తులు, నాప్కిన్స్, ప్యాడ్స్ వంటివి వాడాలన్నారు. వాడిన తరువాత ప్యాడ్స్‌ను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా డస్ట్‌బిన్‌లో వేయాలన్నారు. కౌమారదశలో మానసికంగా, శారీరకంగా జరిగే ప్రతిమార్పు పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించడంతో పాటు కౌమార బాలికలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు.

ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి చేయాలని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి సూచించారు. స్థానిక సత్యనారాయణపురం భగత్‌సింగ్ రోడ్డులోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం గరుడ కంటి, దంతవైద్యశాల ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.

300 మందికి వైద్య పరీక్షలు..

ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారని చెప్పారు. తాము ఇప్పటికే స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఐదు వేల ఐఓఎల్ ఆపరేషన్స్ చేయించామన్నారు. గరుడ కంటి, దంత వైద్యశాల నిర్వాహకులు శ్రీహర్ష, ఇబ్రహీం మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా తాము ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 300 మందికి కంటి వైద్యులు నారాయణ, శ్రీ దివ్య దంత వైద్యులు ప్రకాష్ ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు.


వడదెబ్బకు యాచకుడు మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వడదెబ్బకు యాచకుడు మృతి చెందిన ఘటనపై గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... గవర్నర్‌పేట ఎన్టీఆర్ కాంప్లెక్స్ ఏరియాలో రవి అనే యాచకుడు భిక్షాటన చేస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఎన్టీఆర్ కాంప్లెక్స్ సమీపంలో వడ దెబ్బ తగిలిపడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా అతడ్ని గవర్నమెంట్ హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి 10 గంటలకు చనిపోయాడు. రవి సమాచారం తెలిసిన వారు నేరుగా గవర్నర్‌పేట పోలీసుస్టేషన్‌లో గానీ, 0866– 2576023లో గానీ సంప్రదించాలని సీఐ సురేష్ కోరారు.

ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి కుంకుమ, శ్రీచక్రార్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జైనులకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం



మాట్లాడుతున్న మనోజ్‌కొఠారి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో జైనులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ జైన్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి అన్నారు. చైర్మన్‌గా నియమితులైన మనోజ్‌కొఠారికి శ్రీ సంభవనాథ్ రాజేంద్ర సూరి జైన్ సూర్జీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని పూలబావివీధిలో ఉన్న రాజేంద్ర భవన్‌లో సత్కార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్‌కొఠారి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జైనులను గుర్తించిన వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. జైనుల సమస్యలను పరిష్కరించేందుకు తాను వారిధిగా పని చేసి అండగా ఉంటానని తెలిపారు. రానున్న కాలంలో జైనులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. జైనులందరూ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. పలువురు మత గురువులు ఆశీస్సులందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రముఖులు రాజు సోలంకి తదితరులు పాల్గొన్నారు.